ప్రజాశక్తి
గురువారం 31 జులై 2025
5
పార్వతీపురం మన్యం

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఉన్న మిగులు సీట్ల భర్తీ చేస్తున్నట్లు ఇంఛార్జి ప్రిన్సిపల్ ఎ.రజనీకుమారి తెలిపారు. ఉమ్మడి జిల్లా సమన్వయకర్త రూపవతి ఆదేశాల మేరకు గరుగుబిల్లి గురుకుల పాఠశాలలో ఐదో తరగతికి సంబంధించి 15 సీట్లు, ఆరో తరగతికి 2, పదో తరగతికి సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 5 సీట్లు, ద్వితీయ సంవత్సరంలో 11 సీట్లు, బైపీసీలో 2 సీట్లు, ఖాళీలుగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులు మాత్రమే ఈ మిగులు సీట్లలో తక్షణ ప్రవేశాల కోసం ఈనెల 31 గురువారం ఉదయం 10 గంటలకు గరుగుబిల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ఇన్చార్జి ప్రిన్సిపాల్ కోరారు.

ఉచిత గ్యాస్... అంతా తుస్

- లబ్ధిదారుల ఆవేదన
- మొదట విడత అంతంత మాత్రం
- రెండో విడతలో జమ కాని నగదు
- గగ్గోలు పెడుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఎన్నికల్లో గెలిస్తే ప్రతి ఒక్కరికీ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని కూటమి నాయకులు ఊరువాడల్లో ఎన్నికల ప్రచారాల్లో హామీలు ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాదైనా సూపర్ సిక్స్‌లో ఒకటి, రెండో అమలుకు నిర్ణయం తీసుకుంది. అయితే వీటిని అమలు పర్చే తీరు అంతంతమాత్రమేనన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి ఉచితంగా నాలుగు గ్యాస్ సిలెండర్లు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఎంతవరకు ఆ మాట నిలబెట్టుకుందో అందరికీ తెలిసిందే. ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు మొదటి విడత గ్యాస్‌ను విడిపించుకున్న లబ్ధిదారులు ఖాతాకు జమ చేస్తామన్న నగదు కొద్దిమందికి జమయ్యాయి. రకరకాల కారణాలతో అనేక మంది లబ్ధిదారుల ఖాతాలకు జమకాలేదు. దీంతో గ్యాస్ ఏజెన్సీల వద్దకు, స్థానిక సచివాలయాల వద్దకు వెళ్లి ఏదో ఒక విధంగా వాటిని పునరుద్ధించుకొని ఉచిత గ్యాస్ నగదును జమ చేయించుకున్నారు. కానీ రెండో విడత గ్యాస్‌ను విడిపించుకున్నప్పుడు మాత్రం చాలా మంది లబ్ధిదారుల ఖాతాలకు నేటికీ డబ్బులు జమ కాలేదు. సాలూరు పట్టణం, మండలం, మక్కువ, పాచి పెంట మండలాల పరిధిలో సుమారు 24,424 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. నగదు జమ కానీ గ్యాస్ ఏజెన్సీలు, పౌర సరఫరాల అధికారుల చుట్టూ పలుమార్లు తిరిగినా ప్రయోజనం లేకుండా పోతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. అంతేకాకుండా లబ్ధిదారులకు ఇకెవైసి అవ్వలేదని, ఆధార్‌నకు బ్యాంక్ అకౌంట్‌కు లింక్ కాలేదంటూ రకరకాల సాకులు చెప్పి కాలయాపన చేయడమే తప్ప వారికి న్యాయం చేసే పాపాన పోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో లబ్ధిదారులు ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. మొదట విడత ఉచిత గ్యాస్ నగదు కొంత వరకు ఫర్వాలేదనిపించినా రెండో విడత ఉచిత గ్యాస్ నగదు చాలా మంది లబ్ధిదారులకు జమ కాక పోవడంతో మూడో విడత ఇదే విధంగా జరిగినట్లయితే మొత్తం ఈ పథకం అమలుపై లబ్ధిదారులకు అనుమానాలు కలగకమానదు.

రెండో విడత గ్యాస్ విడిపించి చాలా రోజులు కావస్తున్నా నేటికీ చాలా మందికి నగదు జమ చేయకపోవడంతో అసలు ఈ పథకం అమలు మీదే అనుమానాలు కలుగుతున్నాయి. ప్రభుత్వం ఏదైనా పేదలకు మేలు చేసే కార్యక్రమం అమలు చేయడానికి నిర్ణయం తీసుకుంటే దాన్ని అంతిమంగా సామాన్యులకు అందేలా ప్రణాళికలు ముందుగానే చేసుకున్నట్లయితే ఈ పథకంపై అనుమానాలు కలగవు. అంతే గానీ ఏదో ఎన్నికల్లో చెప్పాం... ఏదో మొక్కుబడిగా చేస్తే ఏ పథకమైనా ఇలాగే ఉంటుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంతకీ ఉచిత గ్యాస్ పథకం నిజామా? కాదా? అని చాలామంది లబ్ధిదారులు ప్రశ్నించడం గమనార్హం. ఈ పథకంపై ప్రజలకు అనుమానాలు పోవాలంటే లబ్ధిదారుడు గ్యాస్ ఏజెన్సీల నుంచి గ్యాస్ విడిపించుకున్న తక్షణమే వారి ఖాతాలకు నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

నగదు జమ మా పరిధిలో లేదు

ఈ విషయం మండల సిఎస్‌డిటి కిరీటిని వివరణ కోగా ప్రభుత్వం ప్రకటించిన సమయాలోనే గ్యాస్ బండలను విడుదల చేసుకోవాలన్నారు. అలాగే లబ్ధిదారుల అకౌంట్‌లో గ్యాస్ సబ్సిడీ డబ్బులు పడుతున్నాయా లేదా అన్నది మా పరిధిలో లేదన్నారు.

రెండు దఫాలూ గ్యాస్ నగదు పడలేదు

నేను రోజువారీ కూలీని. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఏడాదికి నాలుగు సిలిండర్లు ఇస్తామన్న ప్రభుత్వం గ్యాస్‌ను విడిపించుకున్నా నా బ్యాంకు అకౌంట్‌లో నగదు జమకాలేదు. డబ్బులు పడతాయని బ్యాంకు దగ్గరికి వెళ్తే రెండు విడతలు నా అకౌంట్‌కు ఉచిత గ్యాస్ డబ్బులు పడలేదు. దీంతో స్థానిక సచివాలయం వద్దకు వెళ్లి అడగ్గా మీకు డబ్బులు పడతాయని చెప్పడమే గానీ నేటికీ నా అకౌంట్‌లో డబ్బులు జమ కాలేదు. ప్రభుత్వం నన్ను తీవ్రంగా మోసగించింది. సంబంధిత అధికారులైన మాలాంటి నిరుపేదలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందజేయాలి.

చందాపురం కుమారి
పెద బారిగాం, సాలూరు మండలం

20సార్లు సచివాలయానికి తిరిగా

నాకు ఉచిత గ్యాస్ డబ్బులు రెండుదఫాలు కూడా జమ కాలేదు. దీంతో సాలూరు గ్యాస్ ఏజెన్సీకి, సచివాయలానికి సుమారు 20సార్లు తిరిగినా ప్రయోజనం లేకపోయింది. ఇదిగో వస్తాయి... అదిగో వస్తాంటూ అధికారులు చెబుతున్నారు తప్ప ఇప్పటి వరకూ ఒక్క పైసా నా ఖాతాలో జమ కాలేదు. మాలాంటి పేదలను ఇలా ఎన్నిసార్లు తిప్పడం ఎంత వరకు సమంజసం. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మాలాంటి వారికి గ్యాస్ డబ్బులను ఎప్పటికప్పుడు ప్రభుత్వం చెప్పినట్లు అకౌంట్‌లో జమ చేయాలి.

చోడిపల్లి అమ్మోజీ,
రాయివలస, సాలూరు మండలం

పవర్ ప్రాజెక్టు భూములు పేదలకు పంపిణీ చేయాలి

రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసిన సామాజిక కార్యకర్త ఇఎఎస్ శర్మ

ప్రజాశక్తి - పార్వతీపురం

కొమరాడ మండలంలో పవర్ ప్రాజెక్ట్ కోసం సేకరించిన 1126 ఎకరాల భూమిని ఆదివాసీ గిరిజనులకు, భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి, సామాజిక కార్యకర్త ఇఎఎస్ శర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఈనెల 27న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి లేఖ రాశారు. కొమరాడ మండలంలో ఆల్ఫా ఇన్ఫ్రా ప్రాప్ అనే కంపెనీకి 2010లో అప్పటి ప్రభుత్వం పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం అనుమతి ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం 640.75ఎకరాల భూమిని కేటాయించింది. జీవో 466 ప్రకారం కొమరాడ మండలంలోని పెదకర్జాల, రేగులపాడు, శివరాంపురం, కోటిపాం గ్రామాల్లో 675.75ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. దీనిలో 273.46ఎకరాల ప్రభుత్వ భూమి, 249.26ఎకరాల డి పట్టా, 79 ఎకరాల జలవనరులు వున్నాయి. పెదఖర్జేల, రేగులపాడు గ్రామాలు షెడ్యూల్ ప్రాంతంలో ఉన్నాయి. కోటిపాం,పెదకర్జాల,రేగులపాడు గ్రామాల్లో ట్రైబల్ సబ్ ప్లాన్ కింద రూ.686లక్షలతో వనకాబడి సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ఇలాంటి ప్రాంతంలో ప్రయివేటు కంపెనీకి భూములు కేటాయించడం గిరిజనులకు అన్యాయం చేయడమేనని భావిస్తున్నారు. జంఝావతి, నాగావళి నదుల నుంచి 1.5 టిఎంసి నీటిని పవర్ ప్రాజెక్ట్ అవసరాల కోసం కేటాయించాలని నిర్ణయించారు. ఈ భూములు కాక ఆల్ఫా ఇన్ఫ్రా ప్రాప్ కంపెనీ మరో 465.51ఎకరాల భూమిని అక్రమంగా కొనుగోలు చేసింది. కొమరాడ, పెదకర్జాల, రేగులపాడు, శివరాంపురం, కోటిపాం, చినకర్జాల గ్రామాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా కంపెనీ ఈ భూములు కొనుగోలు చేసింది. అయితే గత 15 ఏళ్లుగాఈ 1126.06 ఎకరాల భూములు నిరుపయోగంగా వున్నాయి. 2013 డిసెంబర్ 13న కేంద్ర పర్యావరణ శాఖ ఇచ్చిన అనుమతిని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కూడా రద్దు చేసింది. దీంతో చట్ట విరుద్ధంగా కంపెనీ కొనుగోలు చేసిన, సేకరించిన భూములను ఆదివాసీ గిరిజనులు, భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరుతూ ఇఎఎస్ శర్మ రాష్ట్ర మంత్రులకు లేఖ రాశారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్ పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

జీడి ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో గల జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ప్రాసెసింగ్ చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రాసెసింగ్‌ను మంచి నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నాణ్యతా ప్రమాణాలు చక్కగా ఉండడం వల్ల మార్కెట్లో ఒక బ్రాండ్ క్రియేట్ అవుతుందని ఆయన పేర్కొన్నారు. తద్వారా మార్కెటింగ్‌కు పెద్ద ఎత్తున అవకాశాలు లభిస్తాయని చెప్పారు. జీడి పరిశ్రమకు జిల్లా అణువుగా ఉంటుందని, జిల్లాలో పెద్ద ఎత్తున జీడి ఉత్పాదకత ఉండటం, ఇందుకు సహకరిస్తుందని చెప్పారు. సిబ్బంది ఎప్పటికప్పుడు మంచి నైపుణ్యాభివద్ధిని సాధిస్తూ మార్కెట్కు ధీటుగా ప్రాసెసింగ్ చేస్తూ ఒక ఆకర్షణగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

ఇవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. పీరియాడికల్ తనిఖీలో భాగంగా గోడౌన్ తనిఖీ నిర్వహించారు. అన్ని అంశాలు పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయల కల్పనే ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రతి గిరిజన గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర గిరిజనశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మండలంలోని కొట్టుపురం పంచాయతీ బూర్జిలో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం సుపరిపాలనలో తొలి అడుగు 4.1" కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. ప్రస్తుతం మండలంలో పావురం పంచాయతీ పరిధిలో గల దండిగాం రోడ్డు నుంచి తురాయిపాడు బిటి రోడ్డు నిమిత్తం రూ.2.20 కోట్లు, సారిక పంచాయతీ ములక్కాయ వలస రోడ్డుకు రూ.3.30 కోట్లు, సాలూరు నుంచి పూడి కూడలి నుంచి దుగ్గిసాగరం రోడ్డుకు రూ.3 కోట్లును మంజూరు చేయడం జరిగిందన్నారు. దీంతో ఈ గ్రామాలకు రహదారి సౌకర్యం పూర్తిగా నెరవేరుతుందన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కరపత్రం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆమదాల పరమేష్, సీనియర్ నాయకులు బూసి తవుడు, బసవయ్య, ఎంపిటిసి అప్పికొండ రమాదేవి, గ్రామ పార్టీ అధ్యక్షులు అప్పలస్వామి, మత్స శ్యామ్, ప్రసాద్, శ్రావణి, రాజారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాకు 12,944 టన్నుల యూరియా

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాకు 12,944 టన్నులు యూరియా ఇప్పటి వరకు సరఫరా అయిందని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొఆన్నరు. ఈనెలాఖరుకు జిల్లాలో దాదాపు 11,327 టన్నుల యూరియా అవసరమవుతుందని అంచనా వేయగా, ఇప్పటి వరకు 12,944 టన్నులు జిల్లాకు సరఫరా అయ్యిందని చెప్పారు. జిల్లాలో ఎరువుల పంపిణీ పరిస్థితిని పర్యవేక్షణ చేస్తున్నామని, పలు మండలాల్లో రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల లభ్యత, పంపిణీ జరుగుతున్న విధానాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. జిల్లాలో గత ఖరీఫ్‌లో ఇదే సమయంలో 9,465 టన్నుల యూరియాను వినియోగించారని, ప్రస్తుత ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 9,957 టన్నుల యూరియా వినియోగించగా, మిగిలినది ఆర్‌ఎస్‌కె లు, సొసైటీల్లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు. 600 టన్నుల ఆర్‌సిఎఫ్ యూరియా కూడా జిల్లాకు చేరాయన్నారు. క్రిస్కో కంపెనీకి చెందిన 500 టన్నుల యూరియా గురువారం రానుందని, పంటల సాగు నమోదైన మండలాలకు ప్రాధ్యాన్యతా క్రమంలో యూరియాను కేటాయిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ డీలర్ల వద్ద 625 టన్నులు, సొసైటీలు, రైతు సేవా కేంద్రాల వద్ద 1440 టన్నులు యూరియా, మార్కెఫెడ్ వద్ద 120 టన్నుల బఫర్ యూరియా నిలువలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో కూడా జిల్లా అవసరాలకు సరిపడా యూరియా రానుందని, ముందస్తుగా ఎక్కువ బస్తాలు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 245 రైతు సేవ కేంద్రాల ద్వారా 7,235 టన్నులు., 22 సొసైటీల ద్వారా 1,369 టన్నుల యూరియా, డీఏపీ ఎరువులను పంపిణీ చేశామని తెలిపారు. ఎరువులకు సంబంధించి ఏదైనా సూచనలు, మార్గదర్శకాలు, సమాచారం అవసరమైతే జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు (7989434766) కాల్ చేయవచ్చని ఆయన తెలిపారు.

పండగలా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగస్టు 9న ఘనంగా వహించాలని పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ పిలుపునిచ్చారు. అందుకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై బుధవారం స్థానిక ఐటిడిఎలో ఎమ్మెల్యే, గిరిజన సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిభింబించేలా ఉండాలన్నారు. ఉత్సవాలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల కోసం రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. ఉత్సవంలో ఐటిడిఎకు సంబంధించిన వివిధ అభివృద్ధి పథకాల స్టాల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. అదే విధంగా గిరిజన కళలు ప్రతిబింబించాలన్నారు. గిరిజనుల్లో అన్ని జాతులకు సంబంధించిన నృత్యాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. శోభాయాత్రలో అధికారులు, గిరిజన నాయకులు సమన్వయంతో కొనసాగాలని సూచించారు. ఈ దినోత్సవాన్ని పార్టీలకు అతీతంగా నిర్వహించాలన్నారు. ఈ ఉత్సవంలో అన్ని మండలాల నుంచి ప్రజల ప్రాతినిధ్యం ఉండేలా చూడాలన్నారు. ఉత్సవానికి హాజరయ్యే ప్రజలకు తాగునీరు, భోజన సౌకర్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో పాలకొండ డిఎస్‌పి ఎం.రాబాబు, ఎపిఒ జి. చిన్నబాబు, పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి, ఎఎంసి చైర్మన్ బిడ్డిక సంధ్యారాణి, గిరిజన సంఘం నాయకులు బి.తేజేశ్వరరావు, బిడ్డక శ్రీనివాసరావు, కె.కాంతారావు, బి.లక్ష్మీనారాయణ, సర్పంచులు కళావతి, సుందరమ్మ, వివిధ పార్టీ నాయకులు నిమ్మక కాంతారావు, బి జయలక్ష్మి, సవర తోట మొఖలింగం ఆర్ట్స్ కోఆర్డినేటర్ శంకర్రావు, వెలుగు సంస్థ డైరెక్టర్ సంజీవరావు, ఎఒ సునీల్, డీడీ అన్నదొర, ఇఇ కుమార్, పిహెచ్‌ఒ గణేష్, ఇతర అధికారులు, వివిధ గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

డ్రోన్‌తో యాంటీ లార్వా ఆపరేషన్ : పిఒ

ప్రజాశక్తి- పాచిపెంట

ఏజెన్సీ ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా డ్రోన్ ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. పైలట్ ప్రాజెక్ట్ గా మండలంలోని కొత్తవలసలో డ్రోన్ ద్వారా చేపట్టిన యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాన్ని పిఒ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వ్యాప్తితో మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటివి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో డిఎంఅండ్ హెచ్‌ఒ ఎస్.భాస్కర్‌రావు, డిఎంఒ మణి, ఎఎంఒ సూర్యనారాయణ, డిడి శివకుమార్, వ్యవసాయశాఖ ఏడి సత్యవతి, ఎఒ తిరుపతిరావు, ఎంపిడిఒ బివిజె పాత్రో, తహశీల్దార్ డి.రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు గూడేపు యుగంధర్, మతల బలరాం, కొత్తల పోలినాయుడు, చల్లా కనక, పూసర్ల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ తోణాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు గురించి ఆరా తీశారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉన్న జంగిల్‌ను తొలగించాలని, తాగడానికి ఆర్‌ఒ వాటర్‌ను అందించాలని, స్నానపు గదులు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అర్థాంతరంగా నిలిచిపోయిన హాస్టల్ అదనపు తరగతి గదులకు నిధులు త్వరలో మంజూరవుతాయని, వీటితో పూర్తి చేయాలని ఐటిడిఎ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు, మంగళవారం పాముకాటుకు గురై విజయనగరం మహారాజా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి కొర్ర సునీల్ యోగక్షేమాల గురించి హాస్టల్ వార్డెన్ ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, వార్డెన్ లచ్చయ్య, ఉపాధ్యాయులు ఐటిడిఎ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

రహదారి భద్రత నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రతి వాహనదారుడు రహదారి భద్రత నియమాలను పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి టి.దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయ జంక్షన్ వద్ద అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి.కాశీరాం నాయక్, పోలీస్, హోమ్ గార్డ్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులను, స్కూల్ పిల్లలను తీసుకెళ్లే పది ఆటోలపై కేసు నమోదు చేసి, 3 ఆటోలను సీజ్ చేస్తూ, సుమారు రూ.55 వేలు అపరాధ రుసుం వసూలు చేశారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై పలువురు పాదాచారులకు, వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తి తప్పనిసరిగా ఐఎస్‌ఐ మార్కు కలిగిన హెల్మెట్‌ను వాడాలని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, మద్యం సేవించి, అధిక వేగంతో వాహనాలు నడపరాదని, విద్యార్థులను తీసుకెళ్లే బస్సులు, ఆటోలు పరిమితికి మించి పిల్లలను ఎక్కించరాదని సూచించారు.

మంత్రి అసత్య ప్రచారం మానుకోవాలి

మున్సిపల్ సమావేశంలో వైసిపి కౌన్సిలర్ల డిమాండ్

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అబద్ధాల ప్రచారం మానుకోవాలని వైసిపి కౌన్సిలర్లు గిరి రఘు, గొర్లి వెంకటరమణ, బలభద్రుని శ్రీనివాసరావు, సింగారపు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మున్సిపల్ సమావేశంలో వైసిపి కౌన్సిలర్లు మాట్లాడారు. శ్యామలాంబ పండగ ముందు మున్సిపాలిటీకి మంజూరైన రూ.2 కోట్లు రుణంతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులను కౌన్సిల్ ఆమోదించిందా లేదా అని కౌన్సిలర్ గిరి రఘు కమిషనర్ బివి ప్రసాద్‌ను నిలదీశారు. తాము ఆమోదించకపోవడం వల్లే పట్టణంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని మంత్రి సంధ్యారాణి పదే పదే ప్రచారం చేయడం సరికాదని అన్నారు. మంత్రి హోదాలో ఉన్న సంధ్యారాణి అబద్ధాలను ప్రచారం చేయడం వల్ల ఆమె స్థాయిని తగ్గించుకున్నట్లవుతుందని అన్నారు. మంగళవారం జరిగిన శ్యామలాంబ ఉత్సవ కమిటీ సమావేశంలో మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ వైసిపి కౌన్సిలర్లు అభివృద్ధి పనులను అడ్డుకున్నారని వ్యాఖ్యానించడం తగదన్నారు. కమిషనర్ ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ రూ.2కోట్లతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు కౌన్సిల్‌లో ఆమోదం తెలిపారని, ఆ పనులు పట్టణంలో జరుగుతున్నాయని స్పష్టం చేశారు. వివిధ దశల్లో ఈ పనులు ఉన్నాయని చెప్పారు. అభివృద్ధి పనులు ఏనాడూ తాము అడ్డుకోలేదని చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ చెప్పారు. ఒక వైపు పనులు జరుగుతుంటే మంత్రి సంధ్యారాణి అడ్డుకున్నామని ప్రచారం చేయడం తగదన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్లు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్‌మోహన్‌రావు, కౌన్సిలర్లు జి.నాగేశ్వరరావు, బి.హైమ, సత్యవతి, కొనిసి వరలక్ష్మి పాల్గొన్నారు.

సమావేశంలో కమిషనర్‌ను నిలదీస్తున్న వైసిపి కౌన్సిలర్లు

రైతులు ఎన్‌పిసిఐ చేయించుకోవాలి

పార్వతీపురం : అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు రైతులు బ్యాంకుల వద్ద ఎన్‌పిసిఐ చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 1400 మంది రైతుల ఎన్‌పిసిఐ వివరాలు పెండింగ్‌లో ఉన్నాయని స్పష్టం చేశారు. రైతులు సంబంధిత బ్యాంక్ వద్దకు వెళ్లి ఎన్‌పిసిఐ చేయించుకోవాలన్నారు. ఎన్ పిసిఐ పెండింగ్ ఉన్న రైతుల వివరాలు గ్రామ రైతు సేవా కేంద్రంలో ఉన్నాయని తెలిపారు. రైతులు ఎన్ పిసిఐకు బ్యాంక్ వద్దకు వచ్చినప్పుడు బ్యాంక్ అధికారులు సహకరించి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

పాలకొండ : జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టిలో పెట్టారు. పట్టణంలో మెయిన్ రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని కోరారు. అలానే కోట దుర్గ ఆలయం అభివృద్ధిపై కూడా చర్చించారు. పాలకొండలో ప్రధాన సమస్యగా ఉన్న డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

బియ్యాలవలస పరిసరాల్లో ఏనుగుల సంచారం

కురుపాం : మండలంలోని బియ్యలవలస పరిసర ప్రాంతాల్లో గల అరటి, చెరుకు, పామాయిల్, మామిడి తోటల్లో ఏనుగులు గుంపు బుధవారం సంచరిస్తూ పలు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ సందర్భంగా స్థానిక గ్రామాల రైతులు, ప్రజలు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఏనుగులను తమ పరిసర ప్రాంతాల నుంచి దూరంగా ఈ ప్రాంత వాసులు తరలించాలని కోరారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

పలు వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపాల్టీ పరిధిలో గల పలు వార్డులో బుధవారం మున్సిపల్ కమిషనర్ సి హెచ్. వెంకటేశ్వర్లు పర్యటించి వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను, తాగునీటి సరఫరాను, ప్రజారోగ్య విభాగం సిబ్బంది కాలువల్లో చేస్తున్న యాంటీలార్వా పిచికారీ పనులను, అన్నా క్యాంటీన్‌లో జరుగుతున్న ఫలహార సరఫరా నిర్వహణలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మున్సిపాల్టీ పరిధిలో గల 30 వార్డుల్లో ప్రతిరోజు పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా జరుగుతుందన్నారు. దీంతో పాటు పలు వార్డుల్లో తాగునీరు సరఫరా సక్రమంగా జరుగుతుందని, పట్టణంలో దోమల నివారణకు యాంటీ లార్వా స్ప్రేయింగ్ సిబ్బందిచే సక్రమంగా జరుపుతున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అన్న క్యాంటీన్ నిర్వహణ పేద ప్రజల కొరకు సక్రమంగా జరుగుతోందని అన్నారు.

వృథాగా పోతున్న సాగునీటికి అడ్డుకట్ట

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో యాలం జంక్షన్ దగ్గర ఇరిగేషన్ కాలువ నుంచి బయటకు నీరు వృథాగా పోతుందని 'ప్రజాశక్తి'లో ఇటీవల ప్రచురితమైన వార్తకు ఇరిగేషన్ డిఇ గనిరాజు స్పందించారు. ఈ మేరకు బుధవారం ఇరిగేషన్ సిబ్బంది ఆధ్వర్యాన కాలువ పనులు చేపట్టి సాగునీరు వృథాకాకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దపొల్ల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్నిమాపక పరికరాలను ఉపయోగించే పద్ధతులు, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదం సంభవించిన ఆ ప్రమాదాన్ని నిర్మూలించే పద్ధతులు, చెరువులు, జలపాతాలు, నదులు, సముద్రాల దగ్గర ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిడుగులు పడే సందర్భంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపైన తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్లయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మూలిగూడ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి సమీపంలో గల మూలిగూడ జంక్షన్ వద్ద కురుపాం ఎస్ఐ పి. నారాయణరావు బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేనటువంటి వాహనాదారులకు అపరాధ రుసుం వేశారు. అనంతరం రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించి ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి మద్యం సేవించకుండా వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని మూలలంక గిరిజన గ్రామంలో బుధవారం స్థానిక ఎస్సై జి కళాధర్ సైబర్ నేరాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఎవరు ఫోన్లకైనా అనుమానాస్పద నెంబర్లు వచ్చినట్లయితే తక్షణమే తనకు సమాచారం ఇవ్వాలన్నారు. అతిగా ఆశపడి మోసపోవద్దని గిరిజనులకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బందితోపాటు గిరిజనులు పాల్గొన్నారు.

విద్య అందని ద్రాక్షలా ఉండకూడదు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా ఉండకూడదని వైసిపి గిరిజన విభాగపు మండల అధ్యక్షులు, స్థానిక సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పలు సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముఖాముఖీ చర్చ నిర్వహించారు. విద్యార్థినుల సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 283 మంది విద్యార్థినులు చదువుతున్నారనీ, వారికి కేవలం 15 మరుగుదొడ్లు మాత్రమే ఉండటంతో, మరిన్ని మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టు గతం నుండి ఖాళీగా ఉందని విద్యార్థులు తెలిపారు. ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థినిలు ఒకే గదిలో ఉండడంతో చదువుకు అంతరాయం ఏర్పడుతోందని విద్యార్థినులు చెప్పారు. హిస్టరీ గెస్ట్ లెక్చరర్ పోస్ట్ కూడా పూర్తిగా మంజూరు కాలేదని, పాఠశాలలో వంటశాల, ఆహార పదార్థాలు వడ్డించే ప్రాంతమంతా బాగోలేదని, వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. పాఠశాల అవతల రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త మొక్కలను గ్రామపంచాయతీ సహకారంతో తొలగించామన్నారు.

జీడి పునరుద్ధరణ పథకాన్ని ప్రారంభించాలి

ప్రజాశక్తి - కొమరాడ

జీడి పునరుద్ధరణ పథకాన్ని ప్రారంభించి రైతులకు అన్ని విధాలా భరోసా కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని దేవుకోన పంచాయతీ బంగారంపేటలో గల జీడి తోటను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల 8 మండలాల్లో 65వేల ఎకరాల జీడి సాగువుతుందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో జీడి పునరుద్ధరణ చేస్తే జనవరి, ఫిబ్రవరి, మార్చి నాటికి పంట దిగుబడి బాగా వచ్చే పరిస్థితి ఉండేదన్నారు. ఇలాంటి సందర్భంలో ఐటిడిఎ ఆర్టికల్చర్ అధికారులు నిర్లక్ష్యం వల్ల జీడి రైతులు చాలా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. పండిన జీడి పిక్కలకు కూడా సరైన గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయకపోవడం వల్ల గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని, కావున జీడి పునరుద్ధరణ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి విద్యార్థికి చట్టాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని పారా లీగల్ వాలంటర్ అంధవరపు కోటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి విద్యార్థులకు చట్టాలు, న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్, సీనియర్ సిటిజన్లతో, కళాశాలలో, బహిరంగ ప్రదేశాల్లో క్రమశిక్షణతో మెలిగి సక్రమంగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కుమారస్వామి, కోర్టు సిబ్బంది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

మున్సిపల్ కార్మికులపై లాఠీఛార్జ్ అమానుషం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై పోలీసు లాఠీ ఛార్జీకి నిరసనగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, మండల కన్వీనర్ బి.సూరిబాబు మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నెల్లూరు మున్సిపల్ కార్మికులపై పోలీసులు లాఠీఛార్జీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మున్సిపాలిటీల్లో కార్మికులు చేస్తున్న పనిని ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. అందులో భాగంగా నెల్లూరు మున్సిపాలిటీలో ప్రైవేటీకరణ ప్రక్రియ ప్రారంభించారని, దీనికి వ్యతిరేకంగానే ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులపై లాఠీఛార్జికి పూనుకోవడం సరైన నిర్ణయం కాదని విమర్శించారు. ఇకనైనా నిర్బంధ చర్యలు మానుకొని కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నాగవంశం శంకరరావు, మామిడి శివ, బంగారు రవి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీవోలు వచ్చే వరకూ పోరాటం

సాలూరురూరల్ : మున్సిపల్ రంగంలో ప్రభుత్వంతో చేసుకుని ఒప్పందాలకు అనుగుణంగా జీవోలు ఇచ్చేంత వరకూ పోరాటం కొనసాగుతుందని, నెల్లూరులో వర్క్ ఔట్సోర్సింగ్ పని ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాడి విజయం సాధించిన నెల్లూరు కార్మికులకు ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సాలూరు కమిటీ అభినందనలు తెలిపింది. ఈ

ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జీవో ప్రతులను యూనియన్ నాయకులు రవి, రాముడు మహిళా కన్వీనర్ స్వప్న ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ సొంత జిల్లా నెల్లూరులో పని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడాన్ని నిరసిస్తూ కార్మిక వర్గం పెద్ద ఎత్తున సమ్మెకు దిగిందన్నారు. దీంతో ప్రభుత్వం వెనక్కు తగ్గాల్సి వచ్చిందని, ఇది కార్మికుల విజయమని తెలిపారు. అలాగే మిగిలిన జీవోల కోసం రాష్ట్రంలో ఇప్పటికే ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పెద్ద ఎత్తున కార్మికులను కదిలించి ఆందోళన చేస్తుందన్నారు. 12వ పిఆర్సి వెంటనే వేసి కార్మికుల వేతనాలు పెంచాలని, ఉద్యోగుల వేతనాలు పెంచాలని లేకుంటే ఈ పెండింగ్ సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటానికి కార్మిక వర్గం సిద్ధమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పోలరాజు, ఈశ్వరరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పి -4తో వెనుకబడే కుటుంబాలు ఉండవు

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వం చేపట్టిన పి-4 (ప్రభుత్వ, ప్రయివేటు, ప్రజల భాగస్వామ్యం) లక్ష్యం మేరకు గ్రామాల్లో బాగా వెనుక బడిన వారిని గుర్తించి వారి అభ్యున్నతికి అభివృద్ధి చెందిన వారి ద్వారా సహకారం అందించి లబ్ది చేకూరే పనులు చేపట్టడంతో గ్రామాల్లో వెనుకబడే కుటుంబాలే ఉండవని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. బుధవారం కొమరాడలో పి-4 సర్వేలో భాగంగా పర్యటించారు. అందులో భాగంగా కసిబోయిన రమేష్ ఒక కుటుంబాన్ని బంగారు కుటుంబంగా చేసేందుకు దత్తత తీసుకొని మార్గదర్శిగా రిజిస్టర్ చేసి నమోదు చేసినట్లు తెలిపారు. పేద కుటుంబాన్ని దత్తత తీసుకున్న రమేష్‌ను ఎంపిడిఒ అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు సిబ్బంది ఉన్నారు.

సీతానగరం :మండలంలోని చినకంలాంలో పి-4 సర్వేను ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగానే కాకుండా విద్య, వైద్యం, తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి బంగారు కుటుంబాలకు తోడ్పాటు అందించేందుకు మార్గదర్శకాలు తోడ్పాటు అందిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, సర్పంచ్ పి.సావిత్రి, తిరుపతిరావు, మాజీ సర్పంచ్ తిరుపతి, నరహరితో పాటు పలువురు నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

8,9 తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభ

పాలకొండ : ఆగస్టు 8,9 తేదీల్లో పాలకొండలో జరగబోయే సిపిఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు నెల్లి సూర్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉత్తరావల్లి మురళీమోహన్, బుడిత అప్పలనాయుడు, భారతి సోమశేఖర్, శ్రీనివాసరావు ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

కెజిబివి హాస్టల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం/ బలిజిపేట

సీతానగరం మండలంలోని గాదెలవలసలో టైపు-4 కస్తూరిబా బాలికల వసతి గృహాన్ని బలిజిపేటలో రూ.కోటి ఎనిమిది లక్షలతో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన టైపు- 4 కస్తూరిబా బాలికల వసతి గృహాన్ని బుధవారం పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర బుధవారం ప్రారంభించారు. వసతి గృహంలో పర్యటించి అక్కడ ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యా బోధన గురించి ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించి అటు కుటుంబానికి ఇటు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మెలుకువలతో కూడిన విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సత్కరించారు. ఇదే ఒరవడిని కొనసాగించి గాదెలవలస కెజిబివి వసతి గృహానికి రాష్ట్రస్థాయిలో మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శంకర్రావు, ఎస్ఎస్ఎ టి.శ్రీనివాసరావు, సర్పంచ్ పొన్నాడ సావిత్రి, తిరుపతమ్మ, తిరుపతిరావు, మండల టిడిపి నాయకులు పి.సత్యనారాయణ, ఆర్.వేణుగోపాలనాయుడు, భోగి శంకరరావు, పెద్దబ్బాయి, పి.నాగభూషణ్, కె.అరవింద్ కుమార్, సర్పంచులు తెంటు రామారావు, గుణుపూరు అన్నంనాయుడు, బలగ శ్రీనివాసరావు, గ్రామ స్థాయి నాయకులు బి.సత్యనారాయణ, వై.ప్రసాదరావు, వై.త్రినాథరావు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుకూలంగా రోడ్లు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజా అవసరాలకు అనుగుణంగా రహదారులు ఏర్పాటు చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని కోటిపాం వద్ద గల సత్యనారాయణ స్వామి ఆలయానికి రహదారి ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. ఉపాధిహామీ నిధులు రూ.40లక్షలతో సిసి రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కోటిపాం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాలకు అవసరమైన కిచెన్ షెడ్డు, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు మంజూరు చేయాలని ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కోటిపాం కాలనీ కోటిపురంలో ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా చేపడుతున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, కాలువల కోసం నిధులు కేటాయించాలని ప్రజలు ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి చేసే దిశగా తను కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సేనపతి శేఖర్ పాత్రుడు, సర్పంచ్ సుగుణ, నాయకులు దేవకోటి వెంకట నాయుడు, సుదర్శన్ రావు, మధుసూదన్‌రావు, ఎన్ని శరత్ కుమార్, బురిడి వేణుగోపాల్, కాళీ, జనసేన కన్వీనర్ శ్రీకర్, ఎఎంసి వైస్ చైర్మన్ గౌరీశంకర్రావు, డైరెక్టర్ శ్రీనివాసరావు, రాఘవ, హరిప్రసాద్, ఎంపిటిసి వెంకటనాయుడు, తిరుపతిరావు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడుతున్నఎమ్మెల్యే జగదీశ్వరి

గిరిజన నాయకత్వంపై చిన్న చూపు వీడాలి

కురుపాం నియోజకవర్గంలో గిరిజన నాయకులు, ప్రతినిధులపై ప్రభుత్వాధికారులు చిన్నచూపు వీడాలని టిడిపి ఎస్టీ సెల్ అరకు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి బిడ్డిక తమ్మయ్య అన్నారు. బుధవారం కోటిపాం వద్ద రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన శిలాఫలకంపై అధికారులు కేవలం గిరిజనులను అవమానిస్తూ వివిధ హోదాల్లో ఉన్న పేర్లను పెట్టకపోవడం బాధాకరమన్నారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్న శేఖర్ పాత్రుడు పేరును శిలాఫలకంపై రాయించారని, అయితే ట్రైకార్ కార్పొరేషన్ డైరెక్టర్ పువ్వుల లావణ్య పేరును రాయకపోవడం గిరిజనులను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు అందర్నీ ఒకేలా చూడాలి తప్ప ఇలా కొంతమందిని పేర్లు పెట్టి మరి కొంతమందిని అవమానించడం సరికాదని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

విస్తృతంగా పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా ఎల్విన్ పేట పోలీసులు అప్రమత్తం అయ్యారు. గుణుపూర్ చెక్ పోస్ట్ కూడలి వద్ద సిఐ బి.హరి ఆధ్వర్యంలో బుధవారం ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రా - ఒడిశా ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని అనుమతి పత్రాలున్న తర్వాతే విడిచిపెట్టారు. మావోయిస్టుల వారోత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పలు కూడళ్లలో ఎల్విన్‌పేట పోలీసులు రాత్రి వేళల్లో పహారా కాస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ శివ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : మావోయిస్టుల వారోత్సవాలు సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న దోనుబాయి జంక్షన్ వద్ద సీతంపేట ఎస్సై వై అమ్మనరావు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మావోయిస్టుల వారోత్సవాలు ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు ప్రోత్సహించిన సందర్భంగా ప్రతి వాహనం క్షుణంగా తనిఖీలు చేపడుతున్నారు. దీంతో పాటు ఏ వాహనం ఎక్కడి నుంచి వస్తుందో ఆరా తీస్తున్నారు. దీనికి సంబంధించిన ధ్రువపత్రాలు పరిశీలించారు.

కొమరాడ : మావోయిస్టువారోత్సవాలు నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై కె.నీలకంఠం తెలిపారు. ఈ మేరకు బుదవారం అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న ప్రధాన కల్వర్టుల వద్ద సరిహద్దు ప్రాంతమైన కునేరు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. మావోయిస్టు వారోత్సవాల్లో భాగంగా కొమరాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ముఖ్యమైన రహదారిపై ఉన్న కల్వర్టులు, అలాగే ముఖ్యమైన స్థలాలను

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎల్విన్‌పేట సిఐ హరి

బాంబు డిస్పోజల్ టీంతో తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనాన్ని తనిఖీలు చేశారు. ఒడిస్సా నుంచి ఆంధ్రాలోకి వస్తున్న వాహనాలను అలాగే సంతల నుంచి పలువురు తీసుకెళ్తున్న సామాగ్రిని పరిశీలించారు. అనుమానత వ్యక్తులు సంచరించినట్లు అనుమానాలుంటే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ప్రజలెవరూ మావోయిస్టులు తలపెడుతున్న కార్యక్రమాలకు సహకరించొద్దని హెచ్చరించారు. 24 గంటలు సరిహద్దు ప్రాంతంలో చెక్పోస్ట్ వద్ద ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది మరియు కేంద్ర పారా మిలటరీ బలగాలు సిబ్బంది పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి

ప్రజాశక్తి - వీరఘట్టం

మెలికలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని స్థానిక వ్యవసాయ అధికారి జక్కువ సౌజన్య రైతులకు సూచించారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ద్రావణం తయారు చేసే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారు చేసే పద్ధతులను రైతులకు అవగాహన కల్పించారు. 50 కేజీల నిమ్మకాయలు, 400 కోడిగుడ్లను అందులో మునిగేలా వేసి 15 రోజుల మరగనిచ్చి పావు కేజీ బెల్లం చొప్పున కలిపి ఇంకో 40 రోజులు మురగబెట్టి ఎకరాకు అర లీటర్ చొప్పున ఏ రకమైన పంటలకు పిచికారీ చేసిన పిందెదశ అభివృద్ధి చెందుతుందని, ఆ దిశగా రైతులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో విఎఎ, రైతులు పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని మక్కువ, దబ్బగెడ్డలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించినట్టు వ్యవసాయ శాఖ అధికారి సిహెచ్ భారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వరి నాట్లు వేసేటప్పుడు నారు చివర్లు తుంచి నాట్లు వేయాలని, ఇలా చేయడం వల్ల కాండం తొలిచే పురుగు నివారించవచ్చని రైతులకు తెలిపారు. అలాగే కాలిబాటలు తీసుకోవాలని, నానో యూరియా, డిఎపిలు ద్రవరూపంలో ఉండడం వల్ల పంటలకు త్వరగా అవసరమైన పోషకాలను అందించే ఆధునిక ఎరువులని రైతులకు సూచించారు. ఇవి పంటల పెరుగుదలను, దిగుబడిని పెంచడానికి సహాయపడతాయని తెలిపారు. సాధారణ ఎరువుల వాడకాన్ని తగ్గించడానికి దోహదం చేస్తాయని వివరించారు. కార్యక్రమంలో విఎఎ ఎం.హేమంత్, రైతులు పాల్గొన్నారు.

చిట్టీల నిర్వాహకురాలు పరారీ

లబోదిబోమంటున్న బాధితులు

పార్వతీపురం: పట్టణంలోని కొత్తవలస మణికంఠ కాలనీకి చెందిన చిట్టీల నిర్వాహకురాలు వారణాసి జయలక్ష్మి పరారైనట్లు తెలుస్తోంది.సుమారు రెండు కోట్లు వరకు ఆమె టోపీ పెట్టారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆమె 45మందికి రూ.90లక్షల మేర బాకీలు వున్నట్లు ఐపి నోటీసులు పంపించడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తన ఆస్తి రెండు లక్షల వరకు ఉంటుందని, దాన్నే బాకీ ఉన్న వారు పంచుకోవాలని ఐపి నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిసింది. చిట్టీల నిర్వహణలో ఆమెకు సహకరించిన బంధువులు కూడా పరారీలో వున్నట్లు సమాచారం. గత 15ఏళ్లుగా ఆమె చిట్టీల నిర్వహణ చేస్తున్నారు. అయితే అకస్మాత్తుగా పరారీ కావడంతో కాలనీవాసులలో ఆందోళన మొదలైంది. బాధితులు ఎంతమంది, ఎంతమేరకు నష్టపోయారనేది తేలాల్సి ఉంది.

అనుమతుల్లేకుండా ప్రయివేట్ క్లీనిక్‌లు

పజాశక్తి - వీరఘట్టం

ఎలాంటి అనుమతుల్లేకుండా పట్టణంలోని పలువురు ఆర్ఎంపిలు క్లీనిక్‌లు నిర్వహిస్తున్న విషయాలు బుధవారం అధికారుల తనిఖీల్లో బయపటపడింది. కలెక్టర్ ఎ.శ్యాంపసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు ఆదేశాల మేరకు బుధవారం వైద్య, రెవెన్యూ, పోలీస్ అధికారులు వీరఘట్టంలో గల ఆర్ఎంపి క్లినిక్‌లను, మందులు షాపులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఆర్ఎంపి క్లినిక్‌లో ఎటువంటి ధ్రువ పత్రాలు లేనప్పటికీ రోగులకు వైద్యం చేస్తున్నారు. మందుల షాపులో బి-ఫార్మసీ ధ్రువ పత్రాలు ఉన్నప్పటికీ బి ఫార్మసీ చేసే వ్యక్తి లేనట్టు గుర్తించారు. అలాగే ఒక్కొక్క అక్రమాలు వెలుగు చూడడంతో తనిఖీ చేసిన అధికారులు నివ్వెరిపోయారు. అలాగే మండలం కేంద్రలోని అన్ని మందుల షాపులు, ఆర్ఎంపి క్లినికులను పరిశీలిస్తే మరిన్ని నిజాలు బయటపడే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఈ తనిఖీల్లో తహశీల్దారు ఎఎస్ కామేశ్వరరావు,

ఆర్ఎంపి క్లీనిక్‌లో మందులను పరిశీలిస్తున్న అధికారులు

వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్, ఎస్సై జి కళాధర్, డిటి జీ ప్రసాదరావు, విఆర్ఒలు వి రమేష్, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

శాశ్వత ఇంటి హక్కు పత్రాలు : డిపిఒ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

రెవెన్యూ గ్రామ పరిధిలో గల ప్రతి ఇంటికీ ప్రభుత్వం శాశ్వత ఇంటి హక్కు పత్రాలు పంపిణీతో పాటు, ఆయా ఇళ్లకు సంబంధించి హద్దులు, ఇంటి విస్తరణ, పొడవు, వెడల్పులు నిర్ణయించి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన స్వామిత్వపై ప్రతి ఒక్కరికి పూర్తిస్థాయి అవగాహన ఉండాలని డిపిఒ కొండలరావు అన్నారు. స్వామిత్వపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ జి.రమేష్ అధ్యక్షతన ఏడు మండలాల విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిఎలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ జిల్లాలో తొలి విడతగా స్వామిత్వ పథకం కింద 250 రెవెన్యూ గ్రామాలను ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జిపిఎస్ మ్యాప్ అనుగుణంగా గ్రామస్థాయిలో గల ఇళ్ల స్థితిగతులు, వాటి విస్తీర్ణ హద్దులు, శాశ్వత పత్రాలు తదితర వాటిపై సర్వే చేపట్టాలన్నారు. ఈ విధానం వల్ల ఆ ఇంటి యజమానికి పూర్తి హక్కు శాశ్వత పత్రాలు ప్రభుత్వమే జారీ చేస్తుందని వివరించారు. జిపిఎస్ మ్యాప్‌లో ప్రభుత్వం జారీ చేసిన విధంగా గ్రామస్థాయిలో సర్వే పూర్తి చేసేందుకు అనుగుణంగా గ్రామ రెవెన్యూలో గల గృహ నిర్మాణాలు, ఖాళీ స్థలాలు ప్రభుత్వ భవనాలు, కాలువలు, రోడ్లు ప్రతి ఒక్క విషయంలోనూ పూర్తిస్థాయిలో సర్వే చేయాల్సి ఉంటుందని వివరించారు. ఇందులో అన్ని శాఖల అధికారులు సమన్వయంగా ముందుకు సాగాలని సూచించారు. అవగాహన సదస్సుకు డిపిఒ ఏడు మండలాల సిబ్బంది హాజరయ్యారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

మండలంలోని ఎంఆర్ నగరం గ్రామ శివారులో గల చిన్నరాయుడు చెరువులో పడి వ్యక్తి వృతి చెందాడు. బుధవారం మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అందిన వివరాల మేరకు గ్రామంలోని బజారువీధికి చెందిన సింగిరెడ్డి రమేష్ (35) పొలం పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో గత కొద్దిరోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రమేషు చెరువులో పడి మృతి చెందినట్లు తెలుస్తుంది. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు కూటమి ప్రభుత్వం నయవంచన : అలజంగి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం హామీ పేరిట నయవంచన చేసిందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు విమర్శించారు. పట్టణంలోని బెలగాంలో గల 14వ వార్డు బైపాస్ కాలనీలో బుధవారం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సర్వేశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన ఇంటింటికి వంచన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా జోగారావు ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుపుకుని వారికి కూటమి ప్రభుత్వం పాలనలో సూపర్ సిక్స్ హామీలన్నీ అందాయా లేదా అని అడగగా అందలేదని, కూటమి ప్రభుత్వం పాలనలో నిలువునా మోసపోయామని ప్రజలు ఆయన ముందు ఆవేదన చెందారు. అనంతరం బైపాస్ కాలనీలో ప్రజల సమీక్షలో నిర్వహించిన సమావేశంలో జోగారావు మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం ఇంటింటికి వంచన చేసిందని, మోసపూరిత హామీలతో గెలిచిన అంతరం హామీల అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతూ గత 14 నెలలుగా హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని. ఇప్పటికైనా మీ అందరికీ కూటమి ప్రభుత్వం ఇస్తామన్నా హామీలు అమలు జరిగేంత వరకు ప్రజల పక్షాన నిలిచి పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ బోన్ గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, బిసి సెల్ అధ్యక్షులు గొర్లి మాధవరావు, మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ షఫీ, షేక్ జలాల్, కోలా సుధా, కౌన్సిలర్ సభ్యులు చీకటి అనురాధ, సువ్వాడ లావణ్య, వై త్రినాథ, వి నేతాజీ, ఇన్చార్జీలు జి పద్మావతి, జి గాయత్రి, నేరేడుబిల్లీ సదానందం, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు చందాన ఆనంద్,

పార్వతీపురం పట్టణంలో ప్రచారం చేస్తున్న జోగారావు, వైసిపి నాయకులు

రాష్ట్ర జిల్లా మరియు నియోజకవర్గ వివిధవిభాగాల నాయకులు, పట్టణ కార్యకర్తలు, స్థానిక ప్రజలు, పాల్గొన్నారు..

సీతానగరం : మండలంలోని కాశీపేటలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం సర్పంచ్, గ్రామ నాయకులు శ్రీను ఆధ్వర్యంలో మొదటి గడప నుంచి చిట్టచివరి గడప వరకు చంద్రబాబు నాయుడు చేసిన మోసపూరితమైన హామీలను గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కర్నీ చైతన్య పరుస్తూ బాబు షూరిటీ మోసం గ్యారెంటీ నినాదంతో గామమంతా మార్మోగిపోయింది. కార్యక్రమంలో జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు బలగ శ్రీరామునాయుడు, జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీ బంకురు శంకర్రావు, జిల్లా నాయకులు. ఆర్‌వి, వాలంటీర్ విభాగ అధ్యక్షులు వేణు, వివిధ గ్రామాల సర్పంచులు బొన్నాడ తిరుపతిరావు పాల్గొన్నారు.